క్లుప్తంగా

యువత దేశ భక్తి కలిగి ఉండాలి



బలోపాసనలో యువత విన్యాసం

కర్నూలు కల్చరల్: యువత దేశ భక్తి కలిగి శక్తి వంతులుగా ఎదగాలని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప రెడ్డి సూచించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో రెవెన్యూ కాలనీలోని శ్రీ హనుమాన్ వ్యాయామశాలలో ఆదివారం మాసిక వర్గను నిర్వహించారు. శౌర్య ప్రశిక్షణ వర్గ పూర్తి చేసి బజరంగ్ దళ్ కార్యకర్తలు, సాప్తాహిక్ మిలన్, బలోపాసన కేంద్రాల కార్యకర్తలు సమావేశంలో పాల్గొని వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ప్రతాప రెడ్డి మాట్లాడుతూ యువత శారీరక ధృడత్వంతో ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలన్నారు. దేశ రక్షణకు, హిందూ ధర్మ పరిరక్షణకు కంకణ బద్ధులు కావాలన్నారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఈపూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

కర్నూలు (రూరల్): ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. ఆదివారం నగరంలోని కార్మిక, కర్షక భవనంలో సీపీఎం కార్యకర్తల సమావేశం ఎం. షరీఫ్ అధ్యక్షతన జరిగింది. గౌస్ దేశాయ్ మాట్లడుతూ... కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్, అబ్దుల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంతో హిందూ ధర్మ పరిరక్షణ



మాట్లాడుతున్న గొల్లపూడి శ్యాంప్రసాద్ ముఖర్జీ

కర్నూలు కల్చరల్: హిందువులందరూ సంఘటితంగా ఉంటేనే హిందూ ధర్మం రక్షించపబడుతుందని వీహెచ్‌పీ కేంద్రీయ లీగల్ సెల్ సదస్యులు గొల్లపూడి శ్యాంప్రసాద్ ముఖర్జీ అన్నారు. ఆదివారం వీహెచ్‌పీ కార్యాలయంలో న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి హిందూ సమాజానికి పెను సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. తగిన న్యాయ సలహా, సహకారాలు అందజేయడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఇందుకు వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రదేశ్ విధి ప్రకోష్ట సంస్థ ఆవిర్భావ అవసరం ఎంతో ఉందన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, కోశాధికారి సందడి మహేశ్వర్, విభాగ్ కార్యదర్శి కోటేశ్వరరావు, సేవా కన్వీనర్ గురుమూర్తి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, కార్యదర్శి భాను ప్రకాష్, న్యాయవాది రుద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం



సమ్మేళనం కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు (రూరల్): గుంటూరు నగరంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30 వరకు రాష్ట్ర స్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం నగరంలోని సీఆర్ భవనంలో సమ్మేళనానికి సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లడుతూ... యువత ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో నగర నాయకులు హుస్సేన్, ఖాసీం, శేషన్న, సుధాకర్ పాల్గొన్నారు.


ఎంఈఓ-1 పోస్టులను యథావిధిగా కొనసాగించాలి


కర్నూలు సిటీ: ప్రస్తుతం మండల విద్యాధికారులుగా పని చేస్తున్న ఎంఈఓ-1 పోస్టులను యథావిధిగా కొనసాగించాలని ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మెన్ ప్రకాష్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిమ్మన్న, జి.హృదయరాజు కోరారు. ఆదివారం ఏక్యాంపులోని మాంటిస్సోరి హైస్కూల్‌లో డీఈఓ రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు జనార్దన్, యూటీఎఫ్ నాయకులు సురేష్‌కుమార్, ఎల్లప్ప, ఏపీటీఫ్ (257) నాయకులు రంగన్న, రామచంద్ర, ఏపీటీఎఫ్(1938) నాయకులు ఇస్మాయిల్, మరియానందం, ఆప్టా నాయకులు సేవనాయక్ పాల్గొన్నారు.

కండరాల్లో కలవరం!

- ఇది అత్యంత అరుదైన మయస్తీనియా గ్రేవిస్ వ్యాధి
- లక్షలో 40 మంది బాధితులు
- కొద్ది పనికే కండరాలు బలహీనం
- వాలిపోయే కనురెప్పలు
- ముందుగా వ్యాధి గుర్తిస్తే నియంత్రణ

కొద్దిదూరం నడిస్తే శరీరం సహకరించదు. కొద్దిసేపటికే తీవ్ర అలసట వ్యాపిస్తుంది. మెట్లు ఎక్కలాంటే నరకమే. కనురెప్పలు వాలిపోతుంటాయి. దృష్టి రెండుగా కనిపిస్తుంది. ఆహారాన్ని కూడా సరిగ్గా నమలలేని పరిస్థితి. ఇవన్నీ అరుదైన మయస్తీనియా గ్రేవిస్ వ్యాధి లక్షణాలు. ఇటీవల కాలంలో పలువురిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. జూన్...మయస్తీనియా గ్రేవిస్ అవగాహన మాసం. ఈ నేపథ్యంలో ఈ వ్యాధిపై ప్రత్యేక కథనం.





కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మయస్తీనియా గ్రేవిస్‌తో బాధపడే వారి సంఖ్య చాలా అరుదుగా కనిపిస్తుంది. చాలా మంది ఈ వ్యాధితో బాధపడుతున్నా వారికి ఈ వ్యాధి ఉన్నట్లు కూడా అవగాహన ఉండదు. ఈ వ్యాధిపై చాలా మంది వైద్యులకు కూడా సరైన అవగాహన లేకపోవడంతో లక్షణాలను బట్టి చికిత్స ఇస్తున్నారు. నిపుణులైన వైద్యులు మాత్రమే ఇలాంటి అరుదైన వ్యాధులను గుర్తించి చికిత్స అందించే అవకాశం ఉంది. జిల్లాలో ఈ వ్యాధితో వెయ్యి మంది దాకా ఉన్నట్లు అంచనా. ప్రతి లక్ష మందిలో 40 మంది దాకా ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

మయస్తీనియా గ్రేవిస్ అంటే...

కండరాలు బలహీనంగా, సులభంగా అలసిపోయేలా చేసే వైద్య పరిస్థితినే మయస్తీనియాగా పిలుస్తారు. ఇది కండరాలు, నాడుల మధ్య సంబంధాన్ని దెబ్బతీసి నియంత్రణను కోల్పోయేటట్లు చేస్తుంది. ఉదాహరణకు మీరు భోజనం మధ్యలో ఉన్నప్పుడు మీ దవడ కండరాలు అలసిపోవడం, బలహీనపడటం వంటి సమస్య కనిపిస్తుంది. ఈ సమయంలో ఆహారాన్ని నమలడం కష్టమవుతుంది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత కండరాలు మళ్లీ బలపడతాయి. అప్పుడు మళ్లీ మీరు తినవచ్చు. కండరాలు ఇలా బలహీనపడటం, విశ్రాంతితో మెరుగుపడటం, ఉపయోగంతో మరింత క్షీణించడం వంటివి మయస్తీనియా గ్రేవిస్‌లోని సంకేతాలు. ఈ వ్యాధితో బాధపడేవారిలో ఈ లక్షణాలు అధ్వానంగా మారే సమయాలను గుర్తించవచ్చు. కొన్నిసార్లు ఈ లక్షణాలు తగ్గవచ్చు లేదా అదృశ్యం కావచ్చు. ఈ వ్యాధి ఏ వయస్సు వారికైనా రావచ్చు. కానీ 40 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న మహిళలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సున్న పురుషులకు ఎక్కువగా వస్తుంది.

వ్యాధి లక్షణాలు

-కొద్దిదూరం నడిస్తే శరీరం సహకరించదు. మెట్లు ఎక్కడానికి కూడా ఇబ్బంది పడతారు.

-దాదాపు 50 శాతం మయస్తీనియా గ్రేవిస్ కేసులలో మొదటి సంకేతాలు, లక్షణాలు కంటి కండరాలలో కనిపిస్తాయి. కొన్నిసార్లు ఒకటి లేదా రెండు కనుబొమ్మలు వాలిపోతాయి. మరికొందరికి దృష్టి రెండుగా కనిపిస్తుంది. ఒక కన్ను మూసుకున్నప్పుడు ఈ పరిస్థితి మెరుగుపడుతుంది.

-15 శాతం కేసుల్లో ముఖం, గొంతు కండరాలపై ప్రభావం చూపుతుంది. బలహీనంగా మాట్లాడటం, మాట విభిన్నంగా ఉండటం, నమలడం, మింగడం, తాగడం, తినడం కష్టంగా మారుతుంది.

-కొన్నిసార్లు మీరు మింగేందుకు ప్రయత్నించే ద్రవాలు ముక్కు నుంచి బయటకు రావచ్చు. కొన్నిసార్లు ముఖకవళికలు భిన్నంగా కనిపించడానికి కారణం కావచ్చు.

వ్యాధినిర్ధారణ పరీక్షలు

రోగి కండరాల స్థాయి, స్పర్శ భావం, ప్రతిచర్యలు, సమన్వయం, కండరాల బలం, సమతుల్యతను పరీక్షించడం ద్వారా నరాల ఆరోగ్యాన్ని వైద్యులు పరిశీలిస్తారు. అసాధారణ యాంటిబాడీస్‌ను గుర్తించేందుకు రక్తపరీక్ష చేస్తారు.

ముందుగా గుర్తిస్తే వ్యాధి నియంత్రణ



మయస్తీనియా గ్రేవిస్ చాలా అరుదైన వ్యాధి. చాలా మంది దీనిపై అవగాహన లేక పలు రకాల మందులు వాడుతూ కాలం వెల్లదీస్తుంటారు. తద్వారా వ్యాధి తగ్గకపోగా మరింత అధికమవుతూ ఇబ్బంది పెడుతూ ఉంటుంది. ముందుగా ఈ వ్యాధిని గుర్తిస్తే నియంత్రణ సులభమవుతుంది. వైద్యులు సూచించిన మందులు వాడుతూ జీవితం హాయిగా గడపవచ్చు.

–డాక్టర్ హేమంత్‌కుమార్, న్యూరాలజిస్టు, కర్నూలు

పిల్లల్లో గుండెజబ్బులను గుర్తించాలి



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్లు రాజేష్, దశరథరామయ్య తదితరులు

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో సకాలంలో గుండెజబ్బులను గుర్తించి చికిత్స అందిస్తే వారు కోలుకునే అవకాశం ఉందని ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) ఎన్‌ఆర్‌పీ స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.రాజేష్ చెప్పారు. ఆదివారం ఐఏపీ, మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో శిశువుల్లో గుండెజబ్బులపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. రాజేష్ మాట్లాడుతూ శిశువు ఊపిరిపీల్చుకోవడం ప్రారంభించి గులాబి రంగులోకి మారినట్లయితే, గుండెజబ్బులు వంద బీపీఎంలోపు ఉంటే అవసరమైన చికిత్స అందించాలన్నారు. ఈ సమయంలో నర్సులు ఏమి చేయాలో అవసరమైన శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో నియేనేటల్ రిసోసియేషన్ ప్రోగ్రామ్ శిక్షకులు డాక్టర్ దశరథరామయ్య, డాక్టర్ సుధాకర్ నాయక్, మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి, పీడియాట్రిక్, నియోనేటలాజిస్టు డాక్టర్ సింధూర, పీడియాట్రిషన్ డాక్టర్ సంధ్య, డాక్టర్ మురార్జి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో పూర్వ విద్యార్థులు

కర్నూలు(రాజ్‌విహార్): అనంతపురం పీజీ సెంటర్‌లో 1974-76 సంవత్సరంలో ఎంకామ్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 47 ఏళ్ల తరువాత స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రొఫెసర్ నాగరాజ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనలో పూర్వ విద్యార్థులు విజయ్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్‌ఆర్‌సీపీ లక్ష్యం



వైఎస్‌ఆర్‌సీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయమనోహరి

- 300 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిక

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా సంక్షేమమే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీ మోహన్‌రెడ్డి అన్నారు. తెలుగు దేశం పార్టీకి చెందిన 300 మంది ఆదివారం రాత్రి వైఎస్‌ఆర్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ పెట్టారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. తాను కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించుకునేందుకు శ్రమించాలన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితే సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకురాలు విజయమనోహరి, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

బిల్లుల వసూలుపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి అన్నారు. ఆదివారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారీ బిల్లులు 100 శాతం రాబట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని లక్ష్యం చేరాలన్నారు. అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పునరుద్ధరించాలన్నారు.

క్రీడా సమాచారం

కొనసాగుతున్న ఒలింపిక్ క్రీడా సంబరాలు



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న లాయర్ జయరాజ్

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం హాకీ పోటీలను న్యాయవాది జయరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం నాయకులు శ్రీనివాసులు, రసూల్, ద్వారకనాథ్, ఆది నారాయణ, బిల్డర్ ఆనంద రెడ్డి పాల్గొన్నారు.

- ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలను మన్సూర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ... కరాటే ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం నాయకులు శ్రీనివాసులు, సునీల్ కుమార్, అవినాష్, ఆరీఫ్, సతీష్ పాల్గొన్నారు.
- స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఉషూ పోటీల్లో 60 మంది పాల్గొని ప్రతిభ కనబరిచారని ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.
- స్విమ్మింగ్ పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ నాయకులు నరసింహులు, శ్రీనివాసులు, అవినాష్, విశ్రాంత శిక్షకులు నటరాజ్ పాల్గొన్నారు.

ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయండి

కర్నూలు (రూరల్): ఒలింపిక్ డే సందర్భంగా ఈ నెల 20వ తేదీన జిల్లా ఒలింపిక్ సంఘం, ఎస్ఎంబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రన్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు బి. రామాంజనేయులు, మహబూబ్‌బాషా ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం ఏడు గంటలకు జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభమై రాజ్ విహార్ మీదుగా కొండారెడ్డి బురుజు వరకు రన్ సాగుతుందన్నారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (రూరల్): విద్యార్థులు తైక్వాండో క్రీడలో రాణించాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నగరూరు శమంతకమణి తెలిపారు. ఆదివారం నగరంలోని పూల మార్కెట్ ఆవరణలో ఉచిత తైక్వాండో శిక్షణ తరగతులను ఆమె ప్రారంభిచారు. కార్యక్రమంలో శిక్షకుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

తాడిపత్రి వాసులకు కర్నూలులో చికిత్స

కర్నూలు(హాస్పిటల్): తాడిపత్రిలో హత్యాయత్నానికి గురైన వారు కర్నూలులో చికిత్స అందుకుంటున్నారు. తాడిపత్రిలోని శ్రీనిధి బండల ఫ్యాక్టరీలో నల్లపురెడ్డి, ఆయన తోడల్లుడు రామేశ్వరరెడ్డి పనిచేస్తున్నారు. రామేశ్వరరెడ్డి రోజూ మద్యం తాగి వచ్చి భార్యను వేధిస్తుండేవాడు. దీంతో రామేశ్వరరెడ్డిని ఫ్యాక్టరీ యజమానితో పాటు నల్లపురెడ్డి మందలించారు. దీంతో శనివారం రాత్రి నల్లపురెడ్డి, ఆయన భార్య కృష్ణవేణిలపై రామేశ్వరరెడ్డి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీలో పనిచేసే మరో వ్యక్తి కూతురు రజిత కూడా గాయపడింది. వీరికి తాడిపత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఆదివారం వారు స్థానిక అమీలియో హాస్పిటల్‌లో చేరగా నల్లపురెడ్డి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు.

25న ఫ్యాప్టో జిల్లా సదస్సు

కర్నూలు సిటీ: ఈ నెల 25వ తేదీన ఏ క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో ఫ్యాప్టో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా చైర్మెన్ ఎస్. గోకారి తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ స్కూల్‌లో ఆ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సర్కారును గద్దెదించాలి

కర్నూలు (రూరల్): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ప్రజా నాట్య మండలి జిల్లా ఇన్‌చార్జ్ రసూల్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవనంలో ప్రజా నాట్య మండలి జిల్లా కార్యవర్గ సమావేశం వెంకటరాముడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్ మాట్లాడుతూ...కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య చేసి కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ ధనుంజయ, హుస్సేన్, బద్రి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విభాగంలో పని విభజన

కర్నూలు (టౌన్) : నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఇటీవల ఒక డీఈఈ, ముగ్గురు ఏఈలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఇతర మున్సిపాల్టీల నుంచి వచ్చిన వారు విధుల్లో చేరారు. అయితే, వారికి బాధ్యతలు కేటాయించడంతో పాటు డీఈఈ, ఏఈలకు విధుల కేటాయిపులో మార్పులు చేర్పులు చేస్తూ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఉత్తర్వుల జారీ చేశారు. డీఈఈ గోపాలక్రిష్ణకు 22 నుంచి 24, 26 నుంచి 32 వరకు ఉన్న వార్డుల్లో అభివృద్ధి పనులు, పార్కులు, ఖాళీ స్థలాల సంరక్షణ తదితర పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. నగరపాలక వాహనాల నిర్వహణ డీఈ షాకీర్ హుస్సేన్, డీఈ గిరిరాజ్, ఏఈ ప్రవీణ్‌కుమార్ రెడ్డికి 7 వ వార్డు నుంచి 13 వ వార్డు, అలాగే 51, 52 వార్డుల పర్యవేక్షణ అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (టౌన్) : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఆదివారం వారు కోడుమూరు ఎమ్మెల్యే జె. సుధాకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ ఎస్. గోకారి, కార్యదర్శి గట్టు తిమ్మన్న, యూటీఎఫ్ రాష్ట్ర సహధ్యక్షుడు సురేష్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ముస్లింల అభివృద్ధికి పెద్దపీట

కర్నూలు (న్యూటౌన్): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలోని జగన్నాథగట్టుపై వెలసిన హజరత్ మౌలాలి సాహెబ్ దర్గా ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆయన దర్గాలో గంధం సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ హజరత్ మౌలాలి సాహెబ్ దర్గాలో అభివృద్ధి పనులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

జేఈఈ ఫలితాల్లో ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వర్ రెడ్డి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యా సంస్థల డీన్స్ సరళ, బాలాజీ

కర్నూలు సిటీ: జాతీయ స్థాయిలో పేరు గాంచిన కాలేజీల్లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో కార్పొరేట్ కాలేజీలు సత్తా చాటాయి. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

- శ్రీచైతన్య జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ కాలేజీ ఏజీఎం మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆ కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జేఈఈ ప్రవేశ పరీక్షల్లో ఎం.రాజ్‌కుమార్ 562 కేటగిరి ర్యాంకు, ఎస్.హర్మిత 2,184వ ర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు సీహెచ్ అమృత ఆల్ ఇండియా లెవెల్‌లో 25,611వ ర్యాంకుతో పాటు మరి కొంత మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. అభినందన కార్యక్రమంలో ఆ కాలేజీ డీన్స్ సరళ, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.
- నారాయణ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యా సంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వర్ రెడ్డి తెలిపారు. వివిధ విభాగాల్లో ఎస్. తరుణ్ 46వ ర్యాంకు, కె.రాఘవేంద్ర రెడ్డి 98వ ర్యాంకు, రోహిత్ కార్తీక్ 133వ ర్యాంకు, బి.భాను ప్రియ 472, కె.భావేష్ 619, ఎ.అనుగ్య 711(ఆల్ ఇండియా లెవెల్‌లో 5,759), పి.ఎస్ సూర్య తేజ 869వ ర్యాంకు, కె.జయరుష 937, ఎ.వినయ్ 1109, జె.పవన్‌కుమార్ రెడ్డి 1,519(ఆల్ ఇండియా లెవెల్‌లో 11,022వ ర్యాంకు)వర్యాంకు సాధించారన్నారు. వీరితో పాటు ఆల్ ఇండియా లెవెల్‌లో సుధీర్‌కుమార్ 11,601, బి.జి మనోజ్‌కుమార్ 11,656, ఎస్.రేవంత్‌కుమార్ 13,330, బి.విశ్వనాథ్ 13,912, సాయిశ్రేష్ఠ 14,017, ఎ.వి సాయి శ్రీ సాహితీ 14,091,అబుబాకర్ సిద్ధిక్ 15,410 ర్యాంకులు సాధించారన్నారు. ఓపెన్ కేటగిరీలో 100లోపు ఇద్దరు, వెయ్యిలోపు 8 మంది, 2వేలలోపు 10 మంంది, 3 వేలలోపు 17 మంది, 5 వేలలోపు 32 మంది ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందిచారు. కార్యక్రమంలో ఆ విద్యా సంస్థల డీన్స్ విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్స్ వేణుగోపాల్ రెడ్డి, జయరామిరెడ్డి, విజయమోహన్, సుజాత, సూర్యకుమారి, సాంబశివా రెడ్డి, కృష్ణారెడ్డి, దేవేందర్, ఖైరుసీసా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన టౌన్ మోడల్ కాలేజీ విద్యార్థి



ఎల్.చరణ్‌కార్తీక్

కర్నూలు సిటీ: ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థి ఎల్.చరణ్‌కార్తీక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా లెవెల్‌లో 8,550వ ర్యాంకు సాధించారు. కేటగిరి విభాగంలో 75వ ర్యాంకు రావడంపై కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కర్నూలు నగరంలో బీఎస్ఎన్ఎల్‌లో ఏజీఎంగా పని చేస్తున్న సుధాకర్ బాబు, వరలక్ష్మి దంపతుల కుమారుడైన ఎల్.చరణ్‌కార్తీక్ పదవ తరగతి వరకు ప్రైవేటు స్కూల్‌లో చదివారు. ఇంటర్ విద్యను టౌన్ మోడల్ కాలేజీలో అభ్యసించి 1000 మార్కులకు 961 మార్కులు సాధించారు. జేఈఈ మెయిన్స్‌లో 98.84 పర్సెంటెల్ సాధించి ఆల్ ఇండియా లెవెల్‌లో 13,509వ ర్యాంకు, కేటగిరీలో 74వ ర్యాంకు సాధించారు. బీటెక్ పూర్తి అయిన తరువాత సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చరణ్‌కార్తీక్ తెలిపారు. జేఈఈలో మంచి ర్యాంకు రావడంతో ఆ విద్యార్థికి ఆదివారం పలువురు అభినందించారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో సింధూర అర్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని ఆంజనేయస్వామికి సింధూ అర్చన, ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ధార్మిక సేవలో భాగస్వాములు కావాలి



సందేశమిస్తున్న రామకృష్ణ ప్రభు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు ధార్మిక సేవలో భాగస్వాములు కావాలని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. ఆయన సందేశమిస్తూ సమస్త సమస్యలకు భగవద్గీత పరిష్కారం చూపుతుందన్నారు. నిత్యం భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు.

నేటి నుంచి వారాహీ నవరాత్రులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో సోమవారం నుంచి 28వ తేదీ వరకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వారాహీ నవరాత్రులు (గుప్త నవరాత్రులు) నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు వారాహీ అమ్మవారి షోడశోపచార పూజ, ఊంజల్ సేవ, దర్బార్ సేవ, మణి ద్వీప వర్ణన పారాయణం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సూర్య నారాయణ స్వామి ఆలయంలో..

నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలోని మహా గౌరి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి ఈనెల 27 వ తేదీ వరకు అమ్మ వారి వారాహీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటలకు లలితా సహస్ర నామార్చన, సాయంత్రం 6.30 నుంచి వారాహీ సహస్ర నామార్చన పూజలు జరుగుతాయని తెలిపారు.